హఫీజ్‌పేట్‌లోని హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం పాటలో రూ. 7.02 లక్షలకు దక్కించుకున్న జ్యువెల్లరీ షాపు అధినేత బాల నరసింహచారి కుమారులు వెంకటేష్ చారి, రవి కుమార్ చారి, హరికుమార్‌చారి
– మాదాపూర్, సెప్టెంబర్ 19



పర్వత్‌నగర్ ప్రధాన కూడలి వద్ద సిద్ధ వినాయక దుర్గ మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద జరిగిన లడ్డూ వేలం పాటలో రూ.1.82 లక్షలకు సొంతం చేసుకున్న బ్రహ్మ. *– అల్లాపూర్, సెప్టెంబర్19*

గణపతి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్‌రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని డైసింగ్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాన్ని ఆయన గురువారం సందర్శించి, స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, డైరెక్టర్‌లు భీంరెడ్డి, సత్తిరెడ్డి, నేతలు పాల్గొన్నారు. *–దుండిగల్, సెప్టెంబర్ 19*

ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థినికి తీవ్రగాయాలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19: ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ కథనం ప్రకారం.. ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన చెన్న కీర్తన మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నది. రోజూ కళాశాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లొస్తుంది. బుధవారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత మైసమ్మగూడలోని కళాశాల సమీపంలో ఈసీఐఎల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో బస్సులోని కండక్టర్ సీటు వద్ద నిలబడింది. ప్రయాణంలో బస్సు డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థిని ఒక్కసారిగా బస్సు ముందు టైర్ల కింద పడింది. దీంతో కాలు పైనుంచి బస్సు వెళ్లడంతో కాలు విరిగిపోయింది. స్థానికులు సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. గురువారం బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడు పెండ్లికి నిరాకరించడంతోనే నర్సు శ్రుతి ఆత్మహత్య
పోలీసుల విచారణలో వెల్లడి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19: ప్రియుడు జీవన్‌పాల్ పెండ్లికి నిరాకరించడంతోనే తీవ్ర మనస్థాపానికి గురై నర్సు శ్రుతి ఆత్మహత్య చేసుకున్నట్లు గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు కారణమైన ప్రేమికుడు జీవన్‌పాల్(26)ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. జడ్చర్లకు చెందిన శ్రుతి (22) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ఓ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తూ గచ్చిబౌలిలోని ఓ లాడ్జిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. కాగా, ఇటీవల ముగ్గురు స్నేహితులతో కలిసి వినాయక నిమజ్జనానికి నగరానికి వచ్చిన శ్రుతి ప్రియుడు జీవన్‌పాల్‌తో పెండ్లి విషయమై మాట్లాడింది. గత శనివారం నలుగురు స్నేహితులు శ్రుతి, మౌనిక, జీవన్‌పాల్, వెంకటేశ్ గచ్చిబౌలిలోని లాడ్జిలో మద్యం సేవించారు. పలువురు యువతులు జీవన్‌పాల్‌కు ఫోన్లు చేయడం చూసిన శ్రుతి తనను పెండ్లి చేసుకోవాలని జీవన్‌పాల్‌ను కోరింది. అతడు నిరాకరించడంతో మనస్థాపానికి గురైన ఆమె ఉరేసుకున్నది. కాగా, శ్రుతి 2022లో మహబూబ్‌నగర్‌లో ఓ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ మాస్టర్‌గా పనిచేసే జీవన్‌పాల్‌తో పరిచయమై అది కాస్తా ప్రేమకు దారితీసింది. శ్రుతితో రెండేండ్లు ఉన్న జీవన్‌పాల్ పెండ్లికి నిరాకరించడంతో ఆమె ఇటీవల ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేటర్ వెంటనే క్షమాపణ చెప్పాలి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19 : మహిళతో జరిగిన గొడవలో కార్పొరేటర్ వెంటనే క్షమాపణ చెప్పాలంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ కారు పార్కింగ్ విషయంలో 2020లో తాను నివాసముంటున్న లక్ష్మి విహార్ ఫేజ్ –2లో వేరే మహిళ విల్లా ముందు పార్క్ చేయడంతో తలెత్తిన వివాదంపై చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా, హైకోర్టులో కార్పొరేటర్‌కు చుక్కెదురు కావడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణలో జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుని 'మీకు క్షమాపణ చెప్పాలని అతన్ని ఆదేశిస్తాం, అది మీరు అంగీకరిస్తారా?' అని బాధితురాలి తండ్రిని అడిగారు. దీనికి అతడు అంగీకరించడంతో బాధితురాలి ఇంటికి వెళ్లి బేషరతుగా ఆమెకు క్షమాపణ చెప్పాలని నాగేందర్ యాదవ్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్‌రుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది.

రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందే..



చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు



రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా ఇతర ముఖ్యనాయకులు

- **స్థాయిని మించి విమర్శలు చేస్తే ప్రతివిమర్శలు తప్పవు..**
- **కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ పార్టీ నేతల హెచ్చరిక**

కేపీహెచ్‌బీ కాలనీ/శేరిలింగంపల్లి/కుత్బుల్లాపూర్/కొండాపూర్/కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో అన్నదాతలందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్రంలో రుణమాఫీకానీ రైతులంతా కలిసి ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టగా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో బాలానగర్‌లోని తన నివాసంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ చేయడానికి పలు షరతులు పెట్టి.. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు.

■ శేరిలింగంపల్లి : రుణమాఫీ పొందని రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాను రాయదుర్గం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజాము సాయిబాబాను ఇంట్లో అరెస్టు చేసిన పోలీసులు ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నం రాజు, తిరుమల్లేశ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

■ కుత్బుల్లాపూర్ : ప్రజాభవన్ ముట్టడిలో భాగంగా పేట్ బషీరాబాద్ పోలీసులు గురువారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను హౌజ్ అరెస్ట్ చేయగా.. మరికొంత మందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో 8 మంది బీఆర్ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

■ కొండాపూర్: రైతుల సమస్యలపై పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత చంద్రశేఖరరావు ఇచ్చిన పిలుపు మేరకు ప్రజాభవన్ ముట్టడిలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులను చందానగర్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రజా పాలనలో రైతుల పక్షాన పోరాడేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించడం సరైందని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో గుర్ల తిరుమలేశ్, ప్రతాప్‌రెడ్డి, ఉమేశ్ తదితరులు ఉన్నారు.

■ కుత్బుల్లాపూర్ :కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తమ వ్యక్తిగత మెప్పును పొందేందుకు ప్రజా సంక్షేమ నేత, అభివృద్ధికి చిహ్నంగా నిలిచి మూడుసార్లు వరుస విజయాలు సాధించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌పై స్థాయికి మించి విమర్శలు చేస్తే ప్రతి విమర్శలు తప్పవని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హెచ్చరించారు. గురువారం చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తూ నిత్యం ప్రజల మధ్య ఉంటున్న జననేత ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను చోటా.. మోటా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు కేఎం గౌరీశ్, కిశోర్‌చారీ, సత్తిరెడ్డి, పద్మ, సాయికిరణ్, రుద్ర అశోక్, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లోని తన నివాసంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డిని హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసులు

చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నేత సూదుల సంపత్‌గౌడ్

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ర్యాలీలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పలు ప్రాంతాల్లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్/అల్లాపూర్, సెప్టెంబర్ 19: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నగరంలోని అన్ని మతాల ప్రజలంతా కలిసిమెలిసి జీవించడం, పండుగలను కలిసిమెలిసి జరుపుకోవడం జరుతుందన్నారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలను మైనార్టీ సోదరులందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమని, నియోజకవర్గం ప్రజలంతా చల్లగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ నేతలు నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, మక్కల నర్సింగ్, కర్రె జంగయ్య తదితరులు ఉన్నారు.

■ మియాపూర్ : సోదర భావం ధర్మ చింతన ప్రేమానురాగాలతో ముందుకు సాగాలన్న మహ్మద్ ప్రవక్త పిలుపును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. సర్వమానవ సమానత్వం శాంతి స్థాపన కోసం పాటుపడాలన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పీజేఆర్‌నగర్ దర్గా వద్ద షౌకత్ అలీ మున్నా, ముజీబ్‌లు, ఎన్‌టీఆర్ నగర్‌లో షారూఖ్, ఖలీమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు, అన్నదానంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, ముస్లింలతో కలిసి పీఏసీ చైర్మన్ గాంధీ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సోదర భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాద్, రామకృష్ణ గౌడ్, కాశీనాథ్ యాదవ్, మారేళ్ల శ్రీనివాస్, మూర్తుజా, ఖైసర్, మల్లేశ్, షాహీద్ షకిల్ మున్నా, ఖాజా మియా, ఇంతియాజ్, మౌలానా, బషీర్ అస్లాం, అహ్మద్, సుల్తానా, ఇక్బాల్, అంజాద్, షకీల్, పోశెట్టి గౌడ్, మహేశ్, దేవి, తదితరులు పాల్గొన్నారు.

■ జీడిమెట్ల : ఇస్లాం మత గురువు మహ్మద్ ప్రవర్త జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ముస్లిం సోదరులు, యువకులు ర్యాలీలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహ్మద్ రఫీ, మక్సూద్‌అలీ, వాహెద్ భాయ్, నిజాం, ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

■ అల్లాపూర్ : మిలాద్ ఉన్ నబీ వేడుకలు అల్లాపూర్ డివిజన్ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సప్థార్‌నగర్, రాజీవ్ గాంధానగర్, యూసుఫ్‌నగర్ ప్రాంతాలను నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్ ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త జయంతిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. హిందువులు, క్రైస్తవులు సైతం విచ్చేసి ర్యాలీకి స్వాగతం పలకడం సోదరభావాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, షేక్ రఫిక్, మిర్జా, అస్లంబేగ్, మహమ్మద్ రఫీ, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ దర్గా వద్ద వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్

ఓల్డ్ బోయిన్‌పల్లిలో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు

అమాయకుడిని చితకబాదిన జీడిమెట్ల పోలీసులు

జీడిమెట్ల, సెప్టెంబర్ 19 : గొడవ పడుతున్న ఇద్దరి వ్యక్తులను ఆపేందుకు మధ్యలో వెళ్లిన ఓ వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని చితక బాదారు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం... షాపూర్‌నగర్ కళావతినగర్‌కు చెందిన రమేశ్ నాయక్ అలియాస్ రాము ఆదివారం రాత్రి షాపూర్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్ వద్ద కల్లు తాగడానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఇద్దరు వ్యక్తులు డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. ఇది గమనించిన రమేశ్ నాయక్ వారిని ఆపేందుకు యత్నించాడు. ఈ విషయమై అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు డయల్ 100కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న జీడిమెట్ల పోలీసులు గొడవపడిన వారిని వదిలేసి మధ్యలో వెళ్లిన రమేశ్‌ను అదుపులోకి తీసుకుని డబ్బులు నీవే తీశావంటూ చితకబాదారు. దీంతో అతడి చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు రమేశ్ విలేకరుల ముందు విలపించాడు. అనంతరం పోలీసులు అతడిని వదిలేశారు.

విచారించి వదిలేశాం: సీఐ

రమేశ్ గతంలో షాపూర్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం దొంగతనం కేసులో జైలుకి వెళ్లి వచ్చాడు. షాపూర్‌నగర్ కల్లు కాంపౌండ్ వద్ద ఐదురోజుల కిందట జరిగిన గొడవలో రమేశ్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేశామే తప్ప కొట్టలేదని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ భర్త మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19 : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడగా.. చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. ఈ ఘనట కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రూప కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కౌడిషాల సైదాపూర్‌కు చెందిన మేఘచంద్ర తల్లిదండ్రులు తిరుపతి(47), స్వరూప (40)తో కలిసి ఎల్లమ్మ బండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌లో ఉంటున్నాడు. తిరుపతి, స్వరూప మాదాపూర్‌లో ఉన్న మైండ్‌స్పేస్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో క్లీనింగ్ పనులు చేస్తున్నారు. నిత్య ఉదయం 6.30గంటలకు డ్యూటీకి వెళ్లి..తిరిగి సాయంత్రం ఇంటికి వస్తారు. బుధవారం ఉదయం తిరుపతి, స్వరూప బైక్‌కు మాదాపూర్‌కు బయలుదేరి ముంబై జాతీయ రహదారి కేపీహెచ్‌బీకాలనీ పిల్లర్ నం.733 వద్దకు రాగానే బైక్‌ను ఆటో ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని వైద్యశాలకు తరలించి.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెట్స్‌జెన్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న తిరుపతి గురువారం మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. స్వరూప పరిస్థితి కూడా విషమంగా ఉన్నదని తెలిపారు. మేఘచంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలను ఆదుకోవాలి

సమాజంలోని పేదలను ఆదుకుని అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని అధ్యక్షుడు సూరగన రాణాప్రతాప్ అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీలోని సేవ్ ఏ లైఫ్ సేవ్టీ ఫర్ హ్యూమానిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని మైత్రీ చిల్డ్రన్స్ హోం, ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమెరికా న్యూజెర్సీలో నివసిస్తున్న సూరగన శరత్, సుభాషిని దంపతుల సాయంతో అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలోని అనాథలైన చిన్నారులు, ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19

రోడ్లు నాణ్యతతో నిర్మించాలి

ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న రహదారుల నిర్మాణాలను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని ఆర్‌పీ కాలనీ హాల్ విస్తరణ, కాలనీ సొసైటీ సమీపంలోని సీసీ రోడ్డు, బాగ్ మీర్ పెట్రోల్ పంప్ నుంచి కూకట్‌పల్లి రామాలయం వైపు వేస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రోజాదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణం అనంతరం సరైన క్యూరింగ్‌ను చేపట్టాలని, ఇరువైపులా మట్టితో చదును చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆశ, మాధవరం రంగారావు, లింగయ్య, ప్రవీణ్, పరుషరాములు, మహేందర్, రవీందర్‌రావు, శ్రీరామ్ పాల్గొన్నారు. *– మియాపూర్, సెప్టెంబర్ 19*

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్‌లో మంజీరా ప్రధాన పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీకేజీ మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన లైన్ కావడం వల్ల రోజువారీ నీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని కార్పొరేటర్ సూచించారు. పైప్‌లైన్లపై ఎప్పటికప్పుడు తగు పర్యవేక్షణ చేపట్టాలని, సమస్య పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎం భాస్కర్, నాగప్రియ, ప్రశాంతి, డీఈ రమేశ్, ఏఈ రాజీవ్, మహదేవ్ కాలనీవాసులు పాల్గొన్నారు. *– మియాపూర్, సెప్టెంబర్ 19*

ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌ను వాడొద్దు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, డీ.పోచంపల్లిలోని 8వ వార్డులో గురువారం స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు,కమిషనర్ కె.సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారంతోపాటు రోడ్లపై పేరుకుపోయిన మట్టిని శుభ్రం చేశారు. అనంతరం ప్రభుత్వ నిషేధించిన ప్లాస్టిక్‌ను వాడొద్దని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వార్డులో ఉన్న బస్తీ దవాఖానాను సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి మహేందర్ యాదవ్, సాయి యాదవ్, గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు జక్కుల శ్రీనివాస్‌యాదవ్, కుంటి నాగరాజు, ఈ.శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. *– దుండిగల్, సెప్టెంబర్ 19*

పెండింగ్ పనులు పూర్తి చేయిస్తా..

డివిజన్ పరిధిలోని కాలనీలలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తానని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీ తోడ్పాటుతో అధిక నిధులను సమీకరించి మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్‌ను గురువారం కలిసి కాలనీ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్గత రహదారులు, తాగునీరు, మెరుగైన విద్యుత్, పటిష్టమైన డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలందరినీ భాగస్వాములు చేస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు దేవేందర్‌రావు, విరూపాక్షాయ, అద్దంకి బాలు చౌదరి, బీఆర్ చౌదరి పాల్గొన్నారు. *– మియాపూర్, సెప్టెంబర్ 19*

అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 19: గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం...వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్‌కు చెందిన లింగాల వెంకట శాస్త్రీకి ముగ్గురు సంతానం. చిన్న కూతురు బాపట్ల రాధా కుమారి(41)కి 17 ఏండ్ల కిందట బాపట్ల శివ సూర్య వెంకట దీక్ష